# కలం స్నేహితులు

జీవితంలో ఎప్పుడూ ఏడవనివాడు ఏడిస్తే కూడా అదోరకం ముచ్చటగా ఉంటుంది సూర్యారావు మద్రాసులో మా మూడేళ్ళ కాలేజీ జీవితంలోనూ అంతగట్టిగా ఎప్పుడూ గోలపెట్టలేదని మాజీ రూమ్‌మేటునయిన నాకు గట్టినమ్మకం, జ్ఞాపకం ఉన్నాయి.

ఒకనాడు మామూలుగా నేను నా రూములో అల్జీబ్రా లెక్కలతో తంటాలు పడుతున్నాను హాస్టలులోకి సహాయంకోసం వచ్చే సంఘసేవకులూ, పేదవిద్యార్థులూ, వరదబాధితులూ, కరువుపీడితులూ, ఇంకా విద్యార్థిభావకవులూ బాగా అనుభవం ఉండడంవలన ఎందుకైనా మంచిదని తలుపులు బంధించి ఉంచాను ఇంతలో ఎవరో తలుపులు దబదబ బాదేరు విసుక్కుంటూ ఏ పాకిస్థాన్‌నుంచి వచ్చిన శరణార్థినో ఊహిస్తూ తలుపుతీసేను తీరా చూస్తే మా సూర్యం! చేతిలో ఏదో లెటరు ఉంది

అలాంటివేళ వాడు రూమువిడిచి బయటకు రావటం ఒకవిచిత్రం వస్తూనే "ఒరే బ్రదర్! ఈ ఘోరమైన అన్యాయం చూశావురా? అసలీ యిండియాలో ఈ యిరవయ్యో శతాబ్దంలో కూడా ఎంతటి ఘోరాలు జరుగుతున్నాయో!" అంటూ నావైపు చూశాడు—సానుభూతికోసం—ఆ ఉత్తరం నాకు అందిస్తూ ఆ ఉత్తరం చదివేసరికి నాకు కొంత సానుభూతి కలిగినా, అది తాజావార్తలు చదివితే వచ్చే దిగ్భ్రమపాటి మాత్రమే అవడంవల్ల—"ఒరే సూర్యం! బ్రిటిష్ మహారాజ్ఞి పెళ్ళికూడా పార్లమెంటు ఇష్టంలేందే జరగటంలేదు. "విచారించకు!" అని ఓదార్చి. "అసలు విషయం ఏమిట్రా? ఎవరీ ఉత్తరంవ్రాసిన పెద్దమనిషి? ఏమాకథ?" అంటూ అడిగేను. వాడుకూడా అందుకు రెడీగా వచ్చినట్లు తనజేబులోనించి యాల్టా డాక్యుమెంటులాంటి ఆశ్చర్యకరమైన ఓ ఉత్తరాల కట్టతీసి నాకిచ్చి చదవమన్నాడు తర్వాత కాస్త ఉపోద్ఘాతం చెప్పేడు. అదేమిటంటే

మావాడికి రోజూ పేపర్లు, మేగజైన్లు తీరికవేళల్లో చదవడం అలవాటు ఒకనాడు ఒకానొక మేగజైన్లో 'కలం స్నేహితుల' పేజీలో ఇలాగున వ్రాసి ఉందట: "మిస్ కమల (18), C/o శ్రీ రావుగారు, భీమవరం. సరదాలు స్పోర్ట్సు న్యూస్, సినిమాలు, కలంస్నేహితులు." సూర్యానికి అదివరకెప్పుడూ లేని సరదాపుట్టుకొచ్చింది. వెంటనే ఆరాత్రంతా పట్టిపట్టి అచ్చులాగ అక్షరాల్తో ఇలా వ్రాసేడుట ఓ ఉత్తరం:

"డియర్ ఫ్రెండ్,

మీఅడ్రసు 'కలం స్నేహితుల' పేజీలో ' ' మేగజైన్లో చూశాను. మీరు మగవారికి ఉత్తరం వ్రాయడమే మహాపచారంక్రింద భావించేబాపతువారు కారని తలుస్తాను.

నేనిక్కడ కాలేజీలో బి ఏ సీనియరు చదువుతున్నాను నాకుకూడా అచ్చంగా మీకున్న వేసరదాలు అందుకే మీకీఉత్తరం వ్రాస్తున్నాను మీరుకూడా ఈపాటికే దైనా

## వి. భాస్కరాచార్య

కాలేజీచదువు ప్రారంభించి ఉంటారని తలచెదను. త్వరలో రిప్లై వ్రాస్తారని ఆశిస్తాను.

మీ స్నేహాన్నికోరే,
సూర్యం."

మావాడు ఇలాంటి ఉత్తరాలకు ఒక నమూనా దగ్గఱ ఉంచుకోవడం ఒక అలవాటుట!

నాలుగురోజులు గడిచాయి బహుశా వాడు ఊహించిఉండడు హఠాత్తుగా ఓనాడు రావలసినచోటినుంచే వచ్చింది ఒక ఉత్తరం సూర్యాని కొక్షణంలో ఎవరెస్టు అధిరోహించినంత హాయి కలిగి, వణుకుతూన్న చేతుల్తో ఉత్తరం అందుకొని చదివేడు

"ప్రియమైన సూర్యంగార్కి,

మీఉత్తరం అందింది నాఅడ్రసు పబ్లిష్ అయినదితడవుగా నాకు ఆరు లెటర్సు వచ్చేయి! అందులో మీఉత్తరం నేను సెలెక్టు చేశాను. మీ రనుకొన్నట్టుగా నేనిక్కడ కాలేజీలో ఇంటర్ సీనియర్ చదువుతున్నాను

నేను మానాన్నగారికేకైకపుత్రికను. నాకు క్రికెట్, టెన్నిస్ ఆటలురాకపోయినా వాటినిగురించి చాలసరదా ఉంది. మీకు వెనకటి క్రికెట్ స్కోరులుగురించి ఏమైనా భోగట్టాకావలిస్తే దయచేసి వ్రాయండి మీరేమైనా ఆటలుఆడతారా?

నిజంగా మీ దస్తూరీచూసి నాకు చాలా ముచ్చటయింది. నా దస్తూరీ బాగుండదు. మన్నించ ప్రార్థన

రిప్లైకెదురుచూస్తూ,
మీ స్నేహితురాలు,
కమల"

ఆ ఉత్తరం అనేకసార్లుచదివి కంఠతా వచ్చేవరకూ మావాడుతృప్తిపడలేదు నిజంగా మావాడికి క్రికెట్, టెన్నిస్ వగైరాలను గురించి ఎక్కువ తెలియదు.

"ఆమె వాళ్ళనాన్న కొక్కర్తే కూతురు!" ఆ క్షణంలో మావాడికి ఓ విజయవంతమైన-విశాలాంధ్ర సుఖ్యాతలాగించిన - బోలెడు లక్షల డబ్బు వ్యయంచేసిన - ఓ పిక్చర్లోని లక్షాధికారియైన తండ్రీ, అతని ఏకైకపుత్రిక అయిన ఓ అందాలరాశి, ఆ పుత్రికను పెళ్ళాడిన అదృష్టవంతుడైన ఓ కాలేజీ స్టూడెంటూ దృష్టిపథంలో మెదిలారు ఆ పిక్చర్లో ఆ అమ్మాయీ, ఆ అబ్బాయి కారులో షికారు వెళ్ళడం, సినిమాలు చూడటం, లోకంలో వీళ్ళొక్కళ్ళే ఆ జాతివాళ్ళయినట్లు పార్కులో విహరించటం, మంచి నేపథ్య సంగీతంతో ఉన్న పాటలు పాడటం, ఏవో పుస్తకాల్లోలాగ హాయిగా మాట్లాడుకోవడం-ఇంకా ఎన్నో జ్ఞప్తికి వచ్చి మావాడికి గిలిగింతలు పెట్టేయిట

ఆ దిగ్భ్రమనుండి తేరుకొని వెంటనే ఒక ఇన్‌లాండ్ లెటరు వ్రాశాడుట!

"మిస్ కమలకు,

మీరు వ్రాసిన ఉత్తరం అందింది మీ ఆదరానురాగాలకు, ప్రత్యేకాభిమానానికీ ధన్యవాదాలు

నేను మా నాన్నగార్కి ఒక్కణ్ణే కొడుకుని. నాకు కలంస్నేహితులంటే మా చెడ్డ సరదా. క్రికెట్, టెన్నిస్ ఆటలంటే నేను చెవికోసుకొంటాను. ఇక్కడ సిటీలో జరిగే మాచ్‌లకు తప్పకుండా హాజరవుతూ ఉంటాను క్రికెట్‌గురించి కావలిస్తే వ్రాస్తాను. మీ ఆదరానికి కృతజ్ఞత

మీ తెలుగు దస్తూరీ బాగానే ఉంది. ఫరవాలేదు. నాకు తెలుగులో చక్కని

శైలిలో వ్రాసేవాళ్లంటే చాలా యిష్టం. మీరు చక్కని తెలుగు వ్రాస్తున్నారు.

వీలయినప్పుడల్లా సినిమాలు చూడటం నాకొక వెర్రి అలవాటు. ఈ మధ్య చూసిన "దేవదాసు" సినిమా చాలా నాకు నచ్చింది. అంతక్రితమే నేను శరత్ నవల చదివి ఉండడంవల్ల ఆ పిక్చరు చూస్తున్నంతసేపూ నాకు ఆ కథలో కొన్ని మహత్తరమైన పోకడలు కన్పించాయి. అవి మీ కభ్యంతరం లేకపోతే వచ్చే లెటర్లో వ్రాస్తాను ఆ పిక్చరు మీరూ చూసేఉంటారు. మీ కెలా ఉంది?

మీ నాన్నగార్ని నేను ముఖతః ఎరగనప్పటికీ వారికి నా నమస్కారములు చెప్పగోరెదను.

త్వరలో రిప్లై వ్రాయండి.

ఇట్లు

మీ సూర్యం—" అని

ఈసారి కూడా మూడోరోజు సాయంత్రానికే రిప్లయి వచ్చిందట ఆ ఉత్తరంలో ఇలా ఉంది

"ప్రియమైన సూర్యానికి,

మీరు వ్రాసిన ఉత్తరం అందింది నాకు మీ ఉత్తరాలు చాల సరదాగా ఉన్నాయి కాబట్టి మీరు నా లెటరు అందిన వెంటనే రిప్లయి వ్రాసేయండి. ఆలస్యం భరించలేను. వీలయితే మీరు మద్రాసులోని ప్రసిద్ధ టెన్నిస్ తారల ఆటోగ్రాఫ్‌లు తీసుకొని నాకు పంపించమని కోరుతున్నాను మీకు తెలుగంటే ఉన్న అభిమానానికీ, నామీద ఉన్న ఆదరానికీ చాలా ఆనందం

నాకు కూడా 'దేవదాసు' పిక్చరు చాలా బాగుంది మీకుతోచిన పోకడలు తప్పకుండా వచ్చే లెటర్లో వ్రాయండి నిజంగా ఆ సినిమా చూస్తున్నంతసేపూ అలాగ ఓ మంత్రముగ్ధురాల్లాగ కూర్చున్నాను శరత్ నవలకూడా తప్పక చదువుతాను

మద్రాసు పటేని గురించి మన తెలుగు దేశంలోను, అందులో మనయీడువాళ్లలో ఉండే ఊహాలు మీకు తెలిసే ఉంటాయి అందుచేత మద్రాసునుగూర్చి వచ్చే లెటర్లో ఏమైనా వ్రాయండి.

ఒక్కమాట మీ ఫొటో ఒకటి పంపించమని కోరిక

మీ జాబు కెదురుచూచే,

మీ కమల"

ఈ లెటరు అందుకొన్న సూర్యం మూర్ఛపోయి, కాస్సేపటికి తెప్పరిల్లి ఉంటాడు. ఇంకా ఆలస్యం ఎందుకన్నట్లు, ఆ వేళే ఎరిగిన ఓ ఫొటోగ్రాఫరుని బ్రతిమాలి చక్కగా ఫొటో తీయించుకొని వెంటనే ఒక కాపీ జతపరచి ఇలాగ వ్రాశాడుట.

"ప్రియమైన కమలకు,

'నా ఉత్తరాలు చదవటానికి బాగుంటా'యని మీ రేమేమో వ్రాశారు. మీ అనుభాగానికి ధన్యుణ్ణి. ఆటోగ్రాఫ్‌లకై తప్పక ప్రయత్నిస్తాను.

ఇక 'దేవదాసు' సంగతి. ఎంతో ఊహ మనస్సులో ఉన్నా వ్రాయలేక పోతున్నందుకు మన్నించండి. ప్రతివాళ్లూ 'దేవదాసు'ను భగ్నప్రేమకు అదర్శంగా తీసుకొనటం అలవాటైపోయింది కాని ఆ కథకు అంతకంటె ఎక్కువ ప్రాముఖ్యం ఉందేమో! మీరు సృజనాత్మక రచన గురించి విన్నారా? కొంచెం వివరిస్తాను.

మనం ఎప్పుడూ మనస్సుకు హత్తుకుపోయేటట్లు చిత్రించేది ఏదయినాసరే — లోకం దృష్టిలో మంచిదయినా, చెడ్డదయినా— మనస్సులో ఒప్పుకొని తీరుతాము. నీతి, అవినీతి—వీటిని గురించి తర్కించి ఓ నిర్ణయానికి ఒప్పించేకంటె సమర్థుడైన కథకుడు ఉన్న పరిస్థితి నే యథాతథంగా హృదయానికి నచ్చేటట్లు చిత్రిస్తాడు. అది చదివిన తర్వాత ఒక గొప్ప ఆనందం—లేక ఉత్తేజం—చదివే వాళ్ళలో కలుగుతుంది

'దేవదాసు' ఫలానా అని ఒక నీతిని బోధించే ఉద్దేశ్యంతో వ్రాయబడలేదు దేవదాసు వటి తెలివి తక్కువ త్రాగుబోతని కాని, 'ప్రేమ' అంటే తెలివితక్కువతనం అనిగాని శరత్ వ్రాయలేదు ఉన్న పరిస్థితిని చక్కగా చిత్రించి, ఆలోచించే బాధ్యత మనకే వదలివేస్తాడు.

సరిగ్గాచూస్తే షేక్స్పియరు నాటకాల్లో కూడా ఇదే సూత్రం కనపడుతుంది. హామ్లెట్, ఒథెల్లో—ఇవి ఒకానొకనీతిని బోధించే ఉద్దేశ్యంతో వ్రాయలేదు కాని అవి కొన్ని జీవితసత్యాలను బోధించవచ్చు హామ్లెట్ తనతల్లి దుష్ప్రవర్తనచూసి ఉద్రిక్తుడవుతాడు స్త్రీజాతిఅంటేనే అతగికి అసహ్యం ఏర్పడుతుంది తుదకు అమాయకపు ప్రేయసి ఆ ఉద్రేకానికి గురిఅవుతుంది ఇది చదువుతుంటే మనకు 'హామ్లెట్ మనలాంటి మనిషే' అనిపించినా, ఏదో ఒక తెలియని సానుభూతి ఏర్పడుతుంది.

ఇప్పుడు మీరీదృష్టితో ఆలోచిస్తే— దేవదాసు పార్వతిని పెళ్లిచేసుకోనే విషయంలో సంశయించడం, తర్వాత ఆమె కూడ పట్టుదలకుపోయి ముసలివాణ్ణే పెళ్ళిచేసుకోవడం, దేవదాసు చివరికి త్రాగుడుకి అలవాటుపడి మరణించడం — ఇలాంటి ఘట్టాలు చాలా చక్కగా అర్థమవుతాయను కొంటాను తప్పకుండా 'దేవదాసు' చదవండి చదివి నే వ్రాసిన విషయాలుగురించి ఆలోచించండి మీ అభిప్రాయాలు వ్రాస్తే చాలా సంతోషం

మద్రాసుగురించి 'ఏమైనా' వ్రాయమన్నారు మీరు బహుశా ఫిలిం స్టుడియోలు, తారలు, మెరీనా బీచి, ఇంకా ఇలాంటివి ఊహిస్తూ ఉంటారు వాటినిగురించి తెలిపే ఒక బుక్‌లెట్ పంపుతున్నాను వీటన్నిటిలోను మెరీనా బీచి నన్ను తన్మయుణ్ణి




చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విషక్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"




తయారుచేయువారు

ది సౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

# ★ కలం స్నేహితులు ★

చేసింది. ఆ బీచిలో ఉన్నంతసేపూ "చల్లని సాగరతీరం ..." అంటూ ఓ సాంఘిక చిత్రంలోని పాట జ్ఞాపకంవస్తుంది.

నా ఫోటో పంపిస్తూ, మీఫోటో ఒకటి పంపించ కోరుతున్నాను

ఇట్లు
మీ సూర్యం"

వాళ్లోనాటికల్లా రిప్లయి వచ్చింది. అందులో ఓ చిన్న ఉత్తరంమాత్రం ఉంది:

"డియర్ సూర్యం,

మీఉత్తరం చదివి నేను థ్రిల్ అయాను మీరు 'దేవదాసు'నుగూర్చి వ్రాసిన విషయాల్ని తర్కించేపాటి తెలివి లేకపోయినా అర్థంచేసుకొన్నాను ఆ 'అమరప్రేమ' లోని మాధుర్యాన్ని గ్రహించాను

మద్రాసు బీచిగురించి వ్రాసినవాక్యాలు చాలా బాగున్నాయి నేను బహుశా త్వరలోనే మద్రాసు వస్తాను. మిమ్మల్ని తప్పక కలుసుకుంటాను.

రేపు ఏప్రిల్ ౧౫ నా పుట్టినరోజు. అందుకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను మీ పుట్టినరోజు ఎప్పుడో తెలియజేస్తే ఓక చిన్న కానుక పంపుదా మనుకొంటున్నాను ఎప్పుడో తెలియజేయండి మీఫోటో చూచి ముచ్చటయింది. భగవంతుడు మీ అందచందాలను, ఆరోగ్యాన్ని ఎప్పుడూ కాపాడాలని కోరుతున్నాను

ఇట్లు
ప్రేమతో
మీ కమల"

సూర్యం బి ఎ ఎస్. లో తగ్గిన అభ్యర్థిలా 'ఫ్లై' లయాడు. ఏదో జీవితపరమార్థం సాధించేసినట్లనిపించింది. "అయితే ఆ అమ్మాయి మనల్ని ప్రేమించేసిందన్నమాట! అహా! ఆమె ఎంతిచక్కగా వ్రాస్తుంది!" అనిపించిందిట చిన్నప్పుడు సూర్యం ఇంటి ప్రక్క ముసలిజ్యోతిష్కుడు ఒకాయన సూర్యం జాతకం చూసి, 'ఈ డింభకుడు చాలా అదృష్టవంతుడవుతాడు!" అన్నాట్ట "మరి తనని ఓఅమ్మాయి ప్రేమించేసింది ఆ అమ్మాయి తండ్రి కోటీశ్వరుడుట కూడా!" అని కూడా అనిపించిందట సూర్యానికి ఆమధ్య విడుదలయిన సినీమాలలోని ప్రేమగీతాలన్నీ అనువుల క్రింద మావాడి నోటంట వచ్చేసేవి మాకు అర్థం కాక "వీడు మారిపోతున్నాడురోయ్!" అనుకొనేవాళ్ళం.

సదరు ఉత్తరం అందిన మరుక్షణంలోనే ఓక ఉత్తరం వ్రాశేడు.

"డియర్ కమలా,

నీ ఉత్తరం అందింది. నాలో ఏదో పరవశత్వం కల్గింది నీ ఫోటో యీసారి వ్రాసేటప్పుడు తప్పకుండా పంపించు

నీ పుట్టినరోజుకి నేను రాలేకపోతున్నందుకు విచారిస్తున్నాను అయినా నీకు నా హృదయపూర్వక అభినందనలు నా పుట్టినరోజు "." త్వరగా రిప్లై వ్రాయి

వీక్ యూ.

ఇట్లు
ప్రేమించే
నీ సూర్యం"—అని

పోస్టుచేసేటప్పుడు గుండెలు బరువుగా కొట్టుకొన్నాయట!

ఈసారి మాత్రం పదిహేనురోజులయినా ఏమీ జాబురాలేదు మావాడు ఆశ్చర్యపోయి విషాదం పొందేడు పరధ్యాన్నంగా ఉంటున్నాడు కాని ఆశమాత్రం చావలేదు ఇలా ఉండగా ఒకనాడు అధాత్తుగా ఓ కవరు వచ్చింది అందులో ఓ శుభలేఖా, ఉత్తరం ఉన్నాయి

"శ్రీ సూర్యారావుగారికి,

మీ రీ ఉత్తరం చూచి ఆశ్చర్యపడి ఉండవచ్చు నన్నెరుగక పోవడంవల్ల. అయినా వ్రాస్తున్నాను. మిమ్మల్ని నేను కూడా సరిగ్గా ఎరుగను కాని మా అమ్మాయికి మీరు ముఖ్య స్నేహితులని అమ్మాయి ఒకసారి చెప్పింది.

అంగుచే మీరు మా కమలపెళ్ళికి తప్పక రావలెను

ఇట్లు
" రావు"

అని ఉంది ఆ ఉత్తరంలో.

మా వాడికి తల తిరుగుతున్నట్లయింది కాళ్లకింద భూమికూడా కదుల్తున్నట్లయిందట "ఆ అమ్మాయి నన్ను నిజంగా ప్రేమించేసి లెటరు వ్రాసిందే! మరి పెళ్లి కెలాగ ఒప్పుకొంది! ఒకవేళ తండ్రిమాట దాటలేకపోయిందేమో!" మావాడికి ఆక్షణంలో మాజీవిద్యార్థి నాయకుడొకాయన ఆయన కాలేజీలో చదివే రోజుల్లో "సంఘంలోని కుళ్ళు" ను గురించి దంచేసిన ఓ గొప్ప ఉపన్యాసం జ్ఞాపకంవచ్చిందట. చాలా ఉద్రేకపడి, ఏమీతోచక నాయీముకి వచ్చేడుట.

మేముకూడా వాడిదుస్థితికి సానుభూతి చూపిస్తూ ఓ అయిదు నిముషాలు నిశ్శబ్దంగా కూర్చున్నాం

* * *

వేసంగి సెలవులికి నేను ఇంటికి వెళ్ళిన తరువాత సూర్యంగురించి దాదాపు మరిచిపోయాను కాని రిజల్ట్సునాడు, వాడు పరీక్ష తప్పటం చాలా ఆశ్చర్యంవేసింది ఓదారుస్తూ లెటరు వ్రాశాను

ఆ రోజునే మాకు ఎస్ ఎస్. ఎల్ సి. క్లాసుమేట్ అయిన సుందర్రావు మాయింటికొచ్చాడు అతను ప్రస్తుతం భీమవరంలో చదువుతున్నాడు. ఏదో కొంత లోకాభిరామాయణం తర్వాత, సూర్యం సంగతి గుర్తుకొచ్చి, సంగతంతా అతనికి చెప్పి, "ఎవరోయ్ ఆ మిస్, కమల? మావాడు నిష్కారణంగా పరీక్ష పాడు చేసుకొన్నాడు!" అన్నాను

అతను నవ్వు, ఏడుపుమధ్య ఒకస్థాయిలో ఆగిపోయి, నిలదొక్కుకుని ఇలాగ చెప్పేడు —"కాలేజీలో ఇంటర్ మొత్తంమీద ఆ పేరున్నవాళ్లు ఎవరూ లేనేలేరోయ్! కాని కమల అన్న ఓ అమ్మాయిని నే నెరుగుదును. నీవు చెప్పిన వివరాలు—ఒక ఇంటర్ మినహా —అన్నీ సరిపోతాయి ఆ అమ్మాయికిలాంటి చిలిపిపనులు అలవాటేనట! ఆ అమ్మాయి ఈ మధ్యే పెళ్లిచేసుకొని సుఖంగా ఉంది. పాపం! మీవాడి కెంతపని జరిగిందీ!" అని నిట్టూర్చేడు ★


పండిత డి. గోపాలాచార్యులవారి
అరుణ
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం, (ప్రైవేటు) లిమిటెడ్, మద్రాసు-17.